ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



కుమరం భీం
జిల్లా వార్తలు



బహిరంగ సభలో మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా

40 వేల కోట్లతో అభివృద్ధి పనులు

- కేంద్రంలో మళ్లీ 'మోదీ' ప్రభుత్వమే
- తెలంగాణలో 10 సీట్లు గెలుచుడు తథ్యం
- మచ్చలేని బీజేపీ పాలనతోనే ప్రజల్లో ఆదరణ
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ హయాంలో అవినీతి
- ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు పెంచుతాం
- జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టును పట్టించుకోని గత ప్రభుత్వాలు
- కాగజ్‌నగర్ వికాస సంకల్ప సభలో అమిత్‌షా

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్/కాగజ్‌నగర్ టౌన్, మే 5: తెలంగాణలో తాము 40వేల కోట్లతో నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణం పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ ఎస్పీఎం క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన వికాస సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. 40వేల కోట్లతో మంచిర్యాల నుంచి ఉట్నూరు మీదుగా ఆదిలాబాద్‌కు బ్రాడ్‌గేజ్ రైల్వే నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో మళ్లీ బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. బీజేపీ హయాంలో చేపట్టిన ప్రత్యేక నిబంధనలతో పరిశ్రమలు పునరుద్దరణ జరిగినట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు రెండు విడుతలుగా ఎన్నికలు పూర్తి అయ్యాయన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి 100 సీట్లు వస్తాయని, మూడో విడత పూర్తి అయ్యే వరకు 200పై చిలుకు స్థానాలు సాధిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు పూర్తి అయ్యాక ఈ సంఖ్య 250కి చేరుకుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రోజు రోజుకు బీజేపీ ఓటు గణనీయంగా పెరుగుతోందని లోక్ సభ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంటు స్థానంతోపాటు రాష్ట్రంలోని పదిస్థానాల్లో బీజేపీ గెలుపు తథ్యమని అన్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్ల తప్పుడు వీడియోలతో ప్రచారం చేస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి తెలంగాణ రాష్ట్రంలో రాగానే ముస్లిం రిజర్వేషన్ రద్దు చేస్తామని ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను పెంచుతామన్నారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం 70సంవత్సరాలుగా ఏలి అవినీతిపాలన చేసినట్టు పేర్కొన్నారు. రాంమందిర్ నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. 2019లో రెండవ సారి మోదీ ప్రధాని కాగానే రాంమందిర్ నిర్మించినట్టు తెలిపారు. ఇప్పటి వరకు బీజేపీ పీఎం మోదీ పాలనలో మచ్చలేని పాలన అందించినట్టు, మూడోసారి కూడా మోదీ ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అంటేనే ముస్లింలను పెంచి పోషించిందమన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే తప్పకుండా ముస్లిం రిజర్వేషన్‌ను తొలగించి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు అదనంగా వర్తింపజేస్తామని ప్రకటించారు.

● విమోచన దినోత్సవాన్ని జరపని పార్టీలు..

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ హయాంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జరుపలేదన్నారు. కానీ తెలంగాణలో ఇప్పటికీ తెలంగాణ విమోచన దినోత్సవం జరుగుతుందంటే కేవలం అది బీజేపీ పార్టీతోనే అని గుర్తు చేశారు. ఏబీసీ అంటే అసదుద్దీన్ ఓవైసీ, బీ అంటే బీఆర్‌ఎస్ పార్టీ, సీ అంటే కాంగ్రెస్ పార్టీ తెలిపారు. ఎంఐఎం పార్టీని ఈ రెండు పార్టీలు వ్యతిరేకించవన్నారు. కానీ తాము ముస్లిం రిజర్వేషన్లు తొలగిస్తామని పేర్కొంటూ దీన్ని తప్పుగా ఫేక్ వీడియోలు సృష్టించినట్టు తెలిపారు. ఈ వీడియో రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి కూడా షేర్ చేసినట్టు తెలిపారు. బీజేపీ నిరుపేదల కోసం పని చేస్తుందన్నారు. కాంగ్రెస్‌పార్టీ అవినీతితో నిండిపోయినట్టు వివరించారు. రానున్న రోజుల్లో బీజేపీని ఆదరించి ఓటేసి గెల్పించాలని కోరారు. ప్రాణహిత ప్రాజెక్టును పట్టించుకోలేదన్నారు. మూతబడిన పరిశ్రమలకు నిబంధనలను సడలించటంతో కాగితపు పరిశ్రమలు పునరుద్దరణ జరిగినట్టు పేర్కొన్నారు. బీజేపీ నిరుపేదల కోసం పని చేస్తోందన్నారు. రానున్న రోజుల్లో బీజేపీని ఆదరించి ఓటేసి గెల్పించాలని కోరారు. ఆదిలాబాద్ జిల్లాలో ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయటంలో బీఆర్‌ఎస్ పార్టీ పూర్తిగా విఫలమైందన్నారు. ధనదోపిడీకి తెరలేపింది పూర్తిగా బీఆర్‌ఎస్ పార్టీ అన్నారు. బీజేపీ మూడోసారి గెలిస్తే ప్రపంచలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్ అవతరించబోతోందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు హరీష్‌బాబు, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్, పాయల శంకర్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి గోడం నగేష్, నాయకులు శ్రీనివాస్, అరిగెల నాగేశ్వర్‌రావు, రాథోడ్ రమేష్, మాజీమంత్రి అమర్‌సింగ్ తిలావత్, తదితరులు పాల్గొన్నారు.



కేంద్రమంత్రి అమిత్ షాతో మాట్లాడుతున్న సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు

● లేనిపోని ఆరోపణలు చేస్తున్న రాహుల్‌గాంధీ

కాంగ్రెస్ పార్టీలో ఉన్న రాహుల్‌బాబా ఇప్పుడు లేనిపోని ఆరోపణలు చేసి ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్నట్టు తెలిపారు. తాము కరోనా సమయంలో ఉచిత టీకాలు ఇస్తే రాహుల్‌బాబా ఈ వ్యాక్సిన్‌లు అంతా కూడా మోదీ వ్యాక్సిన్లు అంటూ విస్తృత ప్రచారం చేసినట్టు తెలిపారు. చివరకు రాహుల్‌బాబా, సోదరి కలిసి చీకట్లో టీకాలు వేయించుకున్నట్టు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు తప్పుడు ఆరోపణలు చేస్తున్నట్టు తెలిపారు. కాశ్మీర్ ప్రజలకు స్వేచ్ఛా స్వతంత్రం ఇచ్చేందుకు ఆర్టికల్ 370 రద్దు చేసినట్టు తెలిపారు. పుల్వామా దాడులు చేస్తే పీఎం మోదీ దేశ సైన్యంతో పాకిస్తాన్‌లో సర్జికల్ స్ట్రయిక్ చేసి ప్రతీకారం చేసి ఉగ్రవాదులను మట్టుకరిపించినట్టు గుర్తు చేశారు. పీఎం మోదీ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఉచిత కరోనా టీకాలు, 12కోట్ల మందికి గ్రామీణప్రాంతాలకు టాయిలెట్ నిర్మాణాలు, 10కోట్ల మందికి ఉజ్వల్ సిలిండర్ల పంపిణీ చేశామన్నారు. 80కోట్ల మందికి ఐదు కిలోల రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసినట్టు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగా ఇప్పుడు రాహుల్‌బాబాకు ఏటీఎంగా తెలంగాణ ఉపయోగపడుతోందన్నారు.

■ వంద రోజుల్లో కేంద్ర నిధులు వంద కోట్లు తెచ్చాం..

-డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు, సిర్పూరు ఎమ్మెల్యే

సిర్పూరు ఎమ్మెల్యేగా గెలిచిన వందల రోజుల్లో తాను కేంద్రం నుంచి వంద కోట్ల నిధులు తెచ్చానని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఈ నిధులతో సంజీవయ్యకాలనీ అండర్ బ్రిడ్జి, చింతగూడ-కాగజ్‌నగర్‌కు ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తున్నట్టు తెలిపారు. అలాగే సిర్పూరు నియోజకవర్గంలో పలు ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌ను గెల్పిస్తే సిర్పూరు నియోజకవర్గంతోపాటు ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లా అభివృద్ధికి మరిన్ని నిధులు వస్తాయన్నారు.

■ బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం..

-పాయల శంకర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే

కేంద్రంలో ఉన్న బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. బీజేపీని ఆదరించి ఓటేయాలన్నారు. కాంగ్రెస్ పాలన అంతా కూడా అవినీతి మయంగా ఉండేదన్నారు. బీజేపీతోనే నిరూపేదలకు న్యాయం జరుగుతుందన్నారు. బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌కు అధిక మెజార్టీతో గెల్పించే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. బీఆర్‌ఎస్‌కు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారు.

■ మూడోసారి బీజేపీకి అవకాశం..:

-రామరావు పటేల్, ముథోల్ ఎమ్మెల్యే

కేంద్రంలో మూడోసారి బీజేపీ అవకాశం ఇవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. బీజేపీతోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందన్నారు. బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ గెలిపించాలని కోరారు.

అమిత్‌షా సభకు తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు



పెంచికలపేట నుంచి బీజేపీ సభకు వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

పెంచికలపేట/దహెగాం/సిర్పూర్(టి), మే 5: కాగజ్‌నగర్ పట్టణంలో కేంద్రహోంశాఖమంత్రి అమిత్‌షా నిర్వహించిన సభకు పెంచికలపేట, దహెగాం, సిర్పూర్ (టి) మండలాల నుంచి పెద్దసంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లారు. దహెగాం మండలం నుంచి ఆ పార్టీ మండలాధ్యక్షుడు ధనుంజయ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ప్రజలు వివిధ వాహనాలపై తరలివెళ్లారు.

ఆత్రం సక్కును అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



వాంకిడిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఆసిఫాబాద్, మే 5: ఆసిఫాబాద్ పట్టణంలోని పలు వీధుల్లో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, గతంలో సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, నిసార్, అహ్మద్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: వాంకిడి మండలం జంబులధరి, వాంకిడి గ్రామాల్లో ఆదివారం జడ్పీటీసీ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పెంటయ్య, రమణ, ఎంపీటీసీ ప్రవీణ్, తుకారాం,వినోద్, జైరామ్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు): మండలంలోని బాండేయర్, ముంజీగూడ తదితర గ్రామాల్లో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు కుంర భీంరావ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే గ్రామాల్లో కనబడుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో విఫలం చెందిందని ఆరోపించారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేయాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు.

భారీ బందోబస్తు మధ్య సభ

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్/కాగజ్‌నగర్ టౌన్, మే 5: కాగజ్‌నగర్‌లో నిర్వహించిన కేంద్ర మంత్రి బహిరంగ సభకు కేంద్ర, రాష్ట్ర బలగాలు భారీ బందోబస్తు కల్పించాయి. సర్‌సిల్క్ హెలిప్యాడ్ ప్రాంతాన్ని పూర్తిగా ఆదుపులోకి తీసుకున్నారు. సభా ప్రాంగణానికి వచ్చే రహదారిలో పోలీసులు అడుగడుగునా బందోబస్తు నిర్వహించారు. సర్‌సిల్క్‌లోని శిశుమందిర్ పాఠశాల గ్రౌండు, వెల్ఫేర్ గ్రౌండులో రెండు హెలిప్యాడ్‌లను ఏర్పాటు చేశారు. ఒక హెలిక్యాప్టర్‌లో మంత్రి రాగా, మరో హెలిక్యాప్టర్‌లో భద్రాత సిబ్బంది వచ్చారు. సభాప్రాంగణం వద్ద ఎలాంటి వాహనాలను అనుమతించలేదు. బందోబస్తులో జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్, ఏఎస్పీ ప్రభాకర్ రావు, డీఎస్పీ కరుణాకర్, సీఐలు శంకరయ్య, రాంబాబు, సాదిక్‌పాషా, సతీష్, అంజయ్య, ఎస్సైలు, కేంద్ర బలగాలు భారీ బందోబస్తును నిర్వహించాయి. అలాగే ఉమ్మడి జిల్లా నుంచి వివిధ ప్రాంతాల్లో పనిచేసే పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.

బీజేపీని ఓడించాలి: డీవైఎఫ్ఐ



సమావేశంలో మాట్లాడుతున్న కార్తీక్

వాంకిడి, మే 5: మతోన్మాద బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని కాపాడాలని డీవైఎఫ్ఐ జిల్లాకార్యదర్శి కార్తీక్ కోరారు. ఆదివారం మండలంలోని ఖిరిడి గ్రామంలో డీవైఎఫ్ఐ మండలకమిటీ సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో రాక ముందు యువతకు ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేసిం దన్నారు. పది సంవత్సరాలలో ప్రభుత్వం నూతన పరిశ్రమలు మంజూరు చేయలేదని, పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్ర మంలో నాయకులు నిఖిల్, శ్రీకాంత్, తిరుపతి, కళ్యాణ్,తిరుపతి, కిరణ్, చరణ్,అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

భానుడి ప్రతాపంతో వెలవెలబోయిన సంత



రద్దీ లేని బెజ్జూరు వార సంత

బెజ్జూరు, మే 5: భానుడు ఉగ్రరూపం దాలుస్తుండడంతో జనం బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. 15రోజులుగా ఎండ తీవ్రం పెరుగుతోంది. ప్రతిరోజు ఉష్ణోగ్రతలు 44డిగ్రీలకు పైగా నమోదు అవుతుండడంతో జనం బయటికి రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ప్రభావం మండల కేంద్రంలో ప్రతి ఆదివారం నిర్వహించే వారసంతపై స్పష్టంగా కనిపించింది. ఎండ తీవ్రత కారణంగా జనం సంతకు రాకపోవడంతో వెలవెలబోయింది. ఎండకారణంగా క్రయవిక్రయదారులు లేక సంతపూర్తిగా బోసిపోయింది. మరో వారం వరకు ఎండల తీవ్రత ఇదేవిధంగా కొనసాగుతుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడ్డ పీడీఎస్ బియ్యం

సిర్పూర్(టి), మే 5: వివిధ మండలాలనుంచి అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్న 18.5క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు వెంకట్రావుపేట చెక్‌పోస్టు వద్ద వేచి ఉండగా కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కౌటాల తదితర మండలాలకు చెందిన ఎనిమిది మంది వ్యక్తులు పి కీర్తన, పెరుగు తులసీరాం, మౌల్కర్ తుకారాం, దుర్గం ఎర్రయ్య, బురుగు సత్తయ్య, చునార్కర్ విఠల్, సత్పుతే సంపత్, దిగిడి భీమయ్య ద్విచక్రవాహనాలపై పీడీఎస్ బియ్యంను మహారాష్ట్రకు తరలిస్తుండగాపట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం సీజ్‌చేసివారిపై 6(ఎ) కేసునమోదు చేసి పైఅధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు.

బీజేపీని ఓడించండి: సీఐటీయూ



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

రామకృష్ణాపూర్, మే 5: బొగ్గుగనుల వేలం చట్టం తెచ్చిన బీజేపీని ఓడించాలని సీఐటీయూ నాయకులు అన్నారు. ఆదివారం రామకృష్ణాపూర్‌లోని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బ్రాంచ్ నాయకులు మాట్లాడుతూ ఎండల వేడినుంచి కార్మికులను రక్షించాలన్నారు. ఓసీలలో ఇస్తున్నట్లు కార్మికుల సంక్షేమం దృష్ట్యా గనుల పైన, వివిధ డిపార్ట్మెంట్‌లలో సర్ఫేస్‌లలో విధులు నిర్వహిస్తున్న కార్మికులందరికీ మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలన్నారు. అదేవిధంగా రానున్న వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని కార్మికవాడలో డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్య వ్యవస్థను మెరుగుపరిచి వర్షానికి కార్మికుల క్వార్టర్లలోకి నీళ్లు రాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం కొత్త గనులకు అనుమతులు ఇవ్వకుండా వేలం పాటలు పెట్టి ప్రైవేటు వారికి అప్పగిస్తూ కోల్‌ఇండియా, సింగరేణి ఉనికి కోల్పోయేలా చేస్తోందన్నారు. బీజేపీని ఓడించి ఇండియా కూటమి బలపరుస్తున్న పెద్దపెల్లి నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్ర మంలో బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్ వెంకటస్వామి, కార్యదర్శి అల్లి రాజేందర్, ఉపాధ్యక్షులు రామగిరి రామస్వామి, వడ్లకొండ ఐలయ్య, సీనియర్ నాయకులు అలవాల సంజీవ్, జోరుక వెంకటేష్, జడల ప్రవీణ్, నాగవల్లి శ్రీధర్, ధనశెట్టి సురేష్, రమేష్, అలవాల అభిలాష్ పాల్గొన్నారు.

పని వేళలపై దిగివచ్చిన యాజమాన్యం

మందమర్రిటౌన్, మే 5: ఎండలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఉద్యోగుల పనివేళలు మార్చాలని ఏఐటీయూసీ చేపట్టిన ఆందోళనలకు యాజమాన్యం దిగివచ్చి పనివేళలు మార్చిందని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, భీమనాధుని సుదర్శన్ తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాటాలు చేస్తామన్నారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఆందోళనలు చేయగా యాజమాన్యం పనివేళలు మార్చిందని తెలిపారు.

పనివేళల మార్పునకు అంగీకరించిన యాజమాన్యం

● పెదవి విరుస్తున్న కార్మికులు ● 2 గంటల మినహాయింపు కోసం పట్టు

శ్రీరాంపూర్, మే 5: ప్రతి వేసవికంటే ఈసారి ఎండవేడి తీవ్రత ఎక్కువగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ మరణాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. అయితే సింగరేణిలో పనిచేసే కార్మికులు సైతం ఎండదెబ్బ నుంచి తప్పించుకోలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఓసీపీలు, సీహెచ్‌పీలు, ఆటో వర్క్ షాప్‌లు, ఇతర విభాగాలలో పనివేళలు మార్చాలని డిమాండ్ పెరుగుతున్నవేళ యాజమాన్యం చేసిన మార్పులపై కార్మికులు పెదవి విరుస్తున్నారు.

భారీగా ఉష్ణోగ్రతలు..

రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో ఇప్పటికే 45డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సోమవారం జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు 46.3డిగ్రీలుగా నమోదయ్యాయి. కేంద్రప్రభుత్వ వాతావరణశాఖ ఎల్లో, రెడ్ అలర్ట్‌లు జారీ చేస్తోంది. ఎవరూ బయట తిరగవద్దని, ఇళ్లల్లోనే ఉండాలని, అవసరమైతే తప్ప బయటికి రావద్దని సూచిస్తున్నారు. ఇక సింగరేణిలో సరేసరి. మరింత అధికంగా ఉష్ణోగ్రతలు ఉంటాయి. ఓసీపీలు, సీహెచ్‌పీలలో కార్మికులు ఆరుబయట పనులు చేయాల్సి ఉంటుంది. ఉదయం నుంచి తీవ్ర ఉష్ణోగ్రతలుండగా, పనులు చేయడంతో కార్మికులు ఎండ బారిన పడి అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉంది.



పనివేళలు మార్చాలని డిమాండ్

ఓసీపీలు, సీహెచ్‌పీలు, బయట పనులు జరిగే ఇతర స్థలాల్లో ఎండవేడిమితో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనివేళలు మార్చాలని, ఎనిమిది పనిగంటలకు బదులుగా ఆరు పనిగంటలు ఉండాలని కార్మికవర్గంవిజ్ఞప్తి చేస్తోంది. మజ్జిగ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని, షెల్టర్లు, కూలర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో శనివారం అన్ని ఏరియాల్లో వినతిపత్రాలు అందించారు. సోమవారం అర్ధనగ్న ప్రదర్శన చేసేందుకు సిద్ధమయ్యారు. ఇతర యూనియన్లు సైతం పనివేళల మార్పును కోరుతున్నాయి.

నోటీసులు జారీ..

యూనియన్ల డిమాండ్ల నేపథ్యంలో పనివేళలు మార్చుతూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. అధికారికంగా సర్క్యులర్ ఇవ్వనప్పటికీ ఓసీపీలు, సీహెచ్‌పీలు, వర్క్‌షాప్‌లు, తదితర ప్రాంతాల్లో నోటీసులు అంటించారు. ఇందులో మొదటి బదిలీ ఉదయం6నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు. రెండవబదిలీ మధ్యాహ్నం 4నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు, మూడవ బదిలీ రాత్రి 11నుంచి ఉదయం 7గంటల వరకు, పంప్స్, ఎలక్ట్రికల్, సేఫ్టీ, జనరల్ షిఫ్టును ఉదయం 6నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, ఓసీపీలలో బ్లాస్టింగ్ ఉదయం 7నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు, లంచ్ బ్రేక్‌కు 30నిమిషాల చొప్పున కేటాయించారు. స్టోర్స్, ఆఫీస్‌స్టాఫ్ పని వేళల్లో మార్పు లేదని నోటీసుల్లో పేర్కొన్నారు.

కార్మికుల పెదవి విరుపు

2015లో 8గంటలకు బదులుగా 6గంటల పనిదినాలు అమలు చేశారు. కానీ యాజమాన్యం ఇప్పుడు ఇచ్చిన నోటీసుల్లో 8గంటల పనిదినాలు ఉండేలా సమయాలను మార్చారు. దీనిపై కార్మికులు పెదవి విరుస్తున్నారు. గతంలో మాదిరిగా 6 గంటలు మాత్రమే అమలుచేయాలని కోరుతున్నారు.

సీఎండీని కలవనున్న ఏఐటీయూసీ

కార్మికవర్గం అభిప్రాయాన్ని గౌరవించిన ఏఐటీయూసీ నాయకులు సోమవారం సీఎండీ బలరాంను కలిసి పనివేళల మార్పులపై చర్చించనున్నారు. 2015మాదిరిగా అమలు చేయాలని కోరనున్నారు. ఆ తరువాతే అధికారికంగా సర్క్యులర్ జారీ అయ్యే అవకాశం ఉంది.

తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం

- వి సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షుడు

ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఓసీపీలు, సీహెచ్‌పీలు, ఇతర అవుట్‌డోర్ పనులు చేసే ప్రాంతాలలో పనివేళలు మార్చాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తున్నాం. వినతిపత్రాలు ఇచ్చాం. నిరసనలు తెలియజేశాం. కానీ గతంలో మాదిరిగా యాజమాన్యం స్పందించలేదు. ఏకపక్షంగా సమయాలను మార్చుతూ నిర్ణయం తీసుకోవడం విస్మయానికి గురిచేసింది. మొదటి బదిలీ ఉదయం 7నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, రెండ బదిలీ సాయంత్రం 4నుంచి రాత్రి 11గంటల వరకు, మూడవ బదిలీ రాత్రి 11నుంచి ఉదయం 7 గంటల వరకు మార్చాలని సీఎండీ బలరాంను కలిసి చర్చిస్తాం. సోమవారం మాత్రం పాత పనివేళలే కొనసాగుతాయి.



ఉష్ణోగ్రత చూస్తున్న ఓసీపీ సిబ్బంది

ఈవీఎం కమీషనింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి


కిష్టంపేటలోని ఈవీఎం స్ట్రాంగ్‌రూంల వద్ద కలెక్టర్ సంతోష్

చెన్నూరు, మే 5: ఈవీఎం కమీషనింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ బదావత్ సంతోష్‌అన్నారు. ఆదివారం మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూంలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి చంద్రకళతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం కమీషనింగ్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే ఎన్నికల కొరకు అదనపు బ్యాలెట్ యూనిట్లను అసెంబ్లీ సెగ్మంట్ల వారిగా ర్యాండమైజేషన్ చేయడం జరిగిందన్నారు. స్ట్రాంగ్ రూంలలో ఈవీఎంలను భద్రపర్చి గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలోతహసీల్దార్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తే కేసులు : డీఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, మే 5: ఇటీవల క్రాంతినగర్‌లో జరిగిన ఘటనలో ఆదిలాబాద్ రెండవపట్టణ పోలీసుస్టేషన్‌లో ఇరువర్గాలకు చెందిన 40 మందిపై నాలుగు కేసులు నమోదైనట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా 30పోలీసు యాక్ట్, ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున అనుమతులు లేకుండా గూమిగూడడం, ర్యాలీలు నిర్వ హించడం చట్ట వ్యతిరేకమని తెలిపారు. క్రాంతినగర్ లో ర్యాలీలకు, సభలకు, సమావేశాలకు, అనుమతులు లేవని, ప్రజలు ఎవరూ రాకూడదన్నారు. చట్టవ్యతిరేకంగా గుమిగూడినట్లయితే సీసీటీవీ, మొబైల్ ఫోన్ వీడియోల ఆధారంగా గుర్తించి కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అనుమతులు లేకుండా సోషల్ మీడియాలో గుమిగూడడాన్ని వ్యాప్తిచేస్తున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసు కోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

రెండు రోజుల పాటు జొన్న కొనుగోళ్లు బంద్

ఇంద్రవెల్లి, మే 5: మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన జొన్న పంట కొనుగోలు కేంద్రాన్ని అనివార్య కారణాలల వలన ఈనెల6,7న రెండు రోజులుబంద్ చేస్తామని పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగిఈనెల8న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. మండల రైతులు గమనించి కొనుగోలుకేంద్రం నిర్వహిస్తున్న అధికారులకు సహకరించాలని కోరారు.

ఊట్ల గిరిజనులకు ఓటు కష్టాలు

- 4 కిలోమీటర్ల పొడువున రాళ్లు తేలిన రహదారి
- ఏడు కిలో మీటర్ల దూరంలో పోలింగ్ కేంద్రం
- రహదారి బాగు లేక ఊట్ల గిరిజనులకు తప్పని ఇబ్బందులు


రాళ్లు తేలిన ఊట్ల రోడ్డు

దండేపల్లి, మే 5: అటవీ ప్రాంతంలో నివసించే ఆదివాసి గిరిజనులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. 7 కిలోమీటర్లు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకొంటున్నారు. పాతమామిడి పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఊట్ల గ్రామం ఉంది. గ్రామంలో సుమారు 22 కుటుంబాలు 80 మంది జనాభా 36 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రభుత్వం, అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కాని ఊట్ల ఆదివాసి గిరిజనులు ఊట్ల నుంచి మామిడిపల్లి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఓటు వేయాలంటే కాలినడక, బైక్, సైకిల్‌పై వెళ్ళాల్సి ఉంటుంది. ఊట్ల గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా రాళ్ల తేలి శిథిలావస్థకు చేరింది. ఎన్నికల సమయంలో అభ్యర్థులు వాహనాలు సమకూర్చుతారు. దీంతో 7 కిలోమీటర్ల దూరంలో పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకుంటారు. రహదారి సరిగా లేకపోవడంతో సైకిళ్లు, ద్విచక్ర వాహనాలపై వెళ్లలంటే ఇబ్బందిగా ఉందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి కష్టాలు తీర్చాలని పాలకులు, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు

గ్రామం వరకు రోడ్డు వేయాలి, ఏర్రయ్య



దట్టమైన అటవీ ప్రాంతంలో నివసించే ఆదివాసి గూడమైన ఊట్ల గిరిజన గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. గతంలో వేసిన మెటల్ రోడ్డు కంకర తేలి నడవడానికి ఇబ్బందికరంగా ఉంది. ప్రభుత్వం స్పందించి ఫారెస్ట్ నుంచి అనుమతి ఇప్పించి ఊట్ల గిరిజన గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

రాళ్లు తేలిన రోడ్డుపై ప్రయాణం కష్టంగా ఉంది : మెతే రజిత



అటవీ ప్రాంతం ప్రారంభం నుంచి ఊట్ల గిరిజన గ్రామం వరకు సుమారు 4 కిలోమీటర్లు మెటల్ రోడ్డు రాళ్ల తేలి శిథిలావస్థకు చేరడంతో ప్రయాణం కష్టంగా ఉంది. ఏళ్లుగా గూడేనికి రోడ్డు సరిగా లేదని అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు వచ్చి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి వెళ్లిపోతారే తప్ప తమ గోడును పట్టించుకోరు. ఈ ప్రభుత్వమైన రోడ్డు సౌకర్యం కల్పించేలా చూడాలి.

ప్రభుత్వ ఆసుపత్రిలో తాగునీటి కటకట

ఆసిఫాబాద్, మే 5: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో తాగనీరు దొరకక పోవడంతో రోగులు,రోగుల బంధు వులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రిలో మంచినీటికోసం ఏర్పాటు చేసిన వాటర్ ఫ్రీజర్ నుంచిమంచినీరు రాక పోవడంతో రోగులు నీటినికొనుక్కొని తాగాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. అసలే వేసవి కాలం ఆపై మండుతున్న ఎండలతో రోగులకు ఆసుపత్రిలో తాగునీరు అందుబాటులో లేకపోవడంతో మంచినీటిని కొనుగోలు చేసి తాగాల్సి వస్తుందని రోగులు వాపోతున్నారు. ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కలెక్టర్ ఆసుపత్రిని సందర్శించి రోగులకు అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆదేశించినప్పటికీ భేఖాతరు చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోగులకు తాగునీరు సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

తాగునీటిని కొనుక్కుంటున్నాం:
- లచ్చవ్వ, రోగి బంధువు



ఆసుపత్రిలో మంచి నీరు రావడం లేదు. రూ.20 చెల్లించి బయల కొనుక్కొని తెచ్చుకుంటున్నాం. ఎండ కాలంలో ఆసుపత్రిలో తాగు నీరు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.


వాటర్ ఫ్రీజర్

గ్రామాల్లో ఓటు హక్కుపై అవగాహన

- టీవీ బటన్ నొక్కేముందు.. ఓటు బటన్ నొక్కాలి : జిల్లా కలెక్టర్ రాజార్షిషా
- ఘన స్వాగతం పలికిన ఆయా గ్రామాల గిరిజనులు


భీంపూర్‌లో ఎడ్లబండిపై ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్


గోపాలకృష్ణ మఠంలో ఓటు ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

భీంపూర్, మే 5: టీవీ బటన్ నొక్కే ముందు పోలింగ్ స్టేషన్ వెళ్లి ఈవీఎం బటన్ నొక్కాలని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. ఆయన ఆదివారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా భీంపూర్ మండల కేంద్రాన్ని సందర్శించారు. ఆయనకు భీంపూర్, అందర్‌బంద్, జలకోరి, గుంజల, బుర్కాగూడ, మార్కగూడ, మందపల్లి గ్రామాలకు చెందిన గిరిజనులు జిల్లా కలెక్టర్‌కు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఎడ్లబండిపై ఎక్కి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అంగన్ బజార్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13వ తేదిన సోమవారం పండుగ వాతావరణంల పోలింగ్ జరగాలన్నారు. మండలంలో వందశాతం ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటలవరకు పోలింగ్ సమయం పెంచడం జరిగిందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. గోవింద్‌పూర్ గ్రామస్థులు కొత్తగా ఏర్పాటు చేసుకున్న గ్రామంలో తాగునీటి సమస్యను పరి ష్కరించాలని మాజీసర్పంచ్ జమునబాయి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా దీనికి ఆయన సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కుమ్రా సుధాకర్, ఎంపీపీ కుడిమేత రత్నప్రభ, సంతోష్, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సత్యనారాయణరావు, డీటీ హరిదాస్, ఐకేపీ అధికారి ప్రసాద్, ఆర్‌ఐలు అశోక్, శారదా, గిరిజన సీడం పురుషోత్తం, మడావి లింబాజి, రామేశ్వర్, సోయంకాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

● 13రకాల కార్డులలో ఏదైనా ఒకటి తీసుకెళ్లాలి

ఆదిలాబాద్ అర్బన్: ఈనెల 13న నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేటప్పుడు 13 రకాల కార్డులలో ఏదైనా ఒకటి తమ వెంట తీసుకెళ్లాలని జిల్లా రిటర్నింగ్ అధికారి రాజార్షిషా తెలిపారు. అంతేకాకుండా అభ్యర్థులు తమ వెంట ఓటర్ కార్డు, ఆధార్‌కార్డు, ఎంఎన్ఆర్‌ఈజీపీ జాబ్‌కార్డు, ఫోటోతు ఉన్న పోస్టాఫీస్ పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, లేబర్ గుర్తింపుకార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, ఫోటోతో ఉన్న పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ గుర్తింపు కార్డు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఇచ్చిన అధికారిక గుర్తింపుకార్డు, దివ్యాంగుల గుర్తింపుకార్డు వెంట తీసుకొని వెళ్లాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు.

● గోపాలకృష్ణ మఠంలో..

ఆదిలాబాద్ అర్బన్: మే 13న జరిగే పోలింగ్‌లో ప్రతీ ఒక్కరు ఓటు వేయా లని కూచిపూడి శిక్షకురాలు అవంతిక అన్నారు. గోపాలకృష్ణ మఠంలో కొనసా గుతున్న వేసవి శిక్షన శిబిరంలో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఓట్ అనే ఆకారంలో కూర్చొని ఓటు ఆవశ్యకతను వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్‌కు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటును వినియోగించుకోవాలని శిక్షకురాలు అవంతిక విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. దేశ భవిష్యత్తు కోసం న్నప్పటి నుంచే అవగాహన కలిగి ఉండాలన్నారు. దేశంలోనే ఆదిలాబాద్‌లో అత్యధిక పోలింగ్ నమోదుకు కలెక్టర్ కృషి చేస్తున్నందు న తమవంతుగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. తమ ఇంట్లోని వృద్ధులకు ఉదయమే తీసుకెళ్లి ఓటు వేసేలా చూస్తామమని పలువురు చిన్నారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దస్నాపూర్‌లో వైభవంగా సామూహిక వివాహాలు


వేడుకలో నూతన వధూరులు


పెళ్లిళ్లను తిలకిస్తున్న ప్రజలు

ఇంద్రవెల్లి, మే 5: మండలంలోని దస్నాపూర్ గ్రామంలో సంత్ సద్గురు పూలాజీ బాబా ధ్యాన్ కేంద్రంలో ఆంద్ ఆదివాసీ సేవ సంఘం, దస్నాపూర్ ఆంద్ ఆదివాసీ సామూహిక వివాహవేడుక నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక వివాహ వేడుకలను వైభ వంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకల్లో పదకొండు నూతన జంటలు ఏక మయ్యాయి. ఈ సామూహి క వివాహ వేడుకలకు బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి, ఎంపీపీ పోటే శోభాబాయి, జడ్పీటీసీ పుష్పలత, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్‌లు హాజరైన నూతన వధు, వరులను అక్షింతలు వేసి ఆశీర్వ దించి కట్నకానుకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దస్నాపూర్ గ్రామ పటేల్ కోటుడే పుండలిక్, ఆంద్ ఆదివాసీ సేవ సంఘం జిల్లా అధ్యక్షులు ముఖడే విష్ణు, జిల్లా ప్రధాన కార్యదర్శి కరాడే మారుతి, ఆంద్ ఆదివాసి సమాజ్ పెద్దలు, ఇంగ్లే వామన్‌రావు, డాకురే రాందాస్, దశరథ్, పాండురంగ్, ఉత్తం, సాయినాథ్, కేశవ, ఆయాపార్టీల నాయకులు, బంధువులు, తదితరులు ఉన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

హాజీపూర్, మే 5: మండలంలోని బలరావుపేట గ్రామానికి చెందిన బొప్పు చరణ్ (31) మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చరణ్ భార్య వివాహేతర సంబంధం విషయం తెలియడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ విషయంపై భార్య, మామను చరణ్ నిలదీయడంతో వారు దూషించడంతో మనోవేదనతో శనివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి అన్న బొప్పు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

గుడుంబా తయారు చేస్తున్న వ్యక్తుల అరెస్టు

బెల్లంపల్లి, మే 5: మండలంలోని బుచ్చయ్యపల్లె శివారులో గుడుంబా తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గుడుంబా తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేయగా 5 లీటర్ల గుడుంబా, 20 కిలోల బెల్లం, 1200 లీటర్ల గుడుంబా తయారు చేయడానికి సిద్ధంగా ఉన్న బెల్లంపానకం, 15 కిలోల డీఏపీ ఎరువు, 3 బిందెలను పట్టుకున్నామన్నారు. గుడుంబా తయారు చేస్తున్న మనపెల్లి మల్లేష్, మనపెల్ల లింగయ్యలను అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను తాళ్లగురిజాల పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

స్విమ్మింగ్ పూల్‌లో మునిగి కానిస్టేబుల్ మృతి


పంజాల సతీష్ (ఫైల్)

నస్పూర్, మే 5 : సీసీసీ ఆర్‌కే-5 కాలనీలో స్విమ్మింగ్ పూల్ ఈతకు వచ్చిన కానిస్టేబుల్ పంజాల సతీష్ (41) నీటిలో మునిగి ఆదివారం మృతి చెందాడు. ఉదయం స్విమ్మింగ్‌కు వచ్చిన సతీష్ నీటిలో దూకగా పైకి రాకుండా నీటిలో మునిగిపోయాడు. స్విమ్మింగ్ పూల్‌లో ఉన్న వారు గమనించి వెంటనే పైకి తీసి సీపీఆర్ చేశారు. అంబులెన్స్ ద్వారా మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షలు చేసే లోపే సతీష్ చనిపోయాడు. గుండె పోటు గురై చనిపోయాడా అనే విషయం నిర్ధారించాల్సి ఉంది. 2013 బ్యాచ్‌కు చెందిన పంజాల సతీష్ మంచిర్యాల పట్టణ పోలీస్‌స్టేషన్ బ్లూకోర్ట్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. మృతుడు సతీష్ స్వగ్రామం ఓదెల మండలం చానగొండ. గద్దెరాగడిలో ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్నాడు. సీసీసీలోని సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించే స్విమ్మింగ్ పూల్‌కు సతీష్ ఫిబ్రవరి 16 నుంచి వస్తున్నాడు. మృతుడికి భార్య స్వప్న, కుమారులు రియాన్, రెషాన్‌లున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి కుమార్ తెలిపారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్


ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

తాండూర్, మే 5: తాండూర్ మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు నుంచి ఐబీ కేంద్రం వరకు ఆదివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతలపై ప్రజలకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలందరు సహకరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. బీఎస్ఎఫ్ డీఎస్పీ రాకేష్ మిత్ర, అడిషనల్ ఎస్ఐ చంద్రమిస్త్రీ, ఎస్ఐలు అనూష, విజయ్, గంగారాం, బీఎస్ఎఫ్ జవాన్‌లు, పోలీసులు పాల్గొన్నారు.

భావప్రకటన స్వేచ్ఛకు భంగం : ప్రొఫెసర్ కోదండరాం


మాట్లాడుతున్న కోదండరాం

మంచిర్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం దేశ పౌరులందరికీ భావ ప్రకటనా స్వేచ్ఛను సమానంగా కల్పించినప్పటికీ కేంద్ర ప్రభుత్వ వైఖరి కారణంగా దానికి భంగం కలుగుతుందని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అభిప్రాయపడ్డారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం పార్లమెంట్ ఎన్నికలు-మన కర్తవ్యం' అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోదండరాం మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం భావప్రకటనా స్వేచ్ఛ లేకుండా నిరంతరం దాడులు చేస్తుందని ఆరోపించారు. ఎదురించిన వారిపై కేసులు పెడుతూ దాడులకు పాల్పడుతుందని, కాకతీయ యూనివర్సిటీలో కవులు, రచయితల మీద దాడి కూడా భావప్రకటనా స్వేచ్ఛ మీద దాడిగా అభిప్రాయపడ్డారు. ప్రశ్నించే గొంతు లను, ప్రతిపక్షాలను అణిచివేయడమే లక్ష్యంగా కేంద్రం ముందుకు వెళ్తోందన్నారు. రాబోయే పార్లమెం ట్ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి సరియైన బుద్ధి చెప్పడం ద్వారా కాంగ్రెస్‌కు మద్దతు పలకాలని కోరారు. తెలంగాణ జనసమితి నాయకులు రామచంద్రారెడ్డి, బాబన్న, బచ్చలి ప్రవీన్‌కుమార్, గోనెల శ్రీనివాస్, జర్నలిస్టు మునీర్, కాంగ్రెస్ నాయకులు కె రవి, పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థులనే గెలిపించాలి

● న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాస్


మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాస్

మంచిర్యాల, మే 5(ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి శ్రీనివాస్ ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ళుగా దేశంలో పాలన సాగిస్తున్న బీజేపీ తన ఫాసిస్టు నియంతృత్వాన్ని దేశంపై రుద్దుతోందని అన్నారు. ప్రజలపై అన్ని వైపుల నుంచి దాడి చేయడా నికి అవసరమైన ప్రతిపాదికను తయారు చేసుకుందని, పోరాడే సంస్థలు, పోరాటాలపై తీవ్రమైన నిర్బంధాన్ని అమలు చేయడానికి పన్నాగం పన్నుతోందన్నారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎన్నికల్లో ఓడించడమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు డి బ్రహ్మానందం, శ్రీనివాస్, లాల్‌కుమార్, ప్రభాకర్, సీనియర్ జర్నలిస్టు మునీర్, తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం



మందమర్రిటౌన్, మే 5: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి చిత్రపటాలకు ఆదివారం పట్టణంలోని నేతకాని సంఘాల నాయకులు క్షీరాభిషేకం చేశారు. నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామనే ప్రకటనను హర్షిస్తున్నామని తెలిపారు. దుర్గం నరేష్‌నేత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

హాజీపూర్, మే 5: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు కోరారు. ఆదివారం ముల్కల్లలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుతోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా రేవం త్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్లు వేసి దొంగ ప్రమాణాలు చేస్తున్నాడన్నారు. మొగిలి శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, రాయలింగు, పాల్గొన్నారు.

పట్టుబడిన నగదు విడుదల

పెద్దపల్లిటౌన్, మే 5: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన తనిఖీలలో ఇప్పటి వరకు కోటి 75 లక్షల 38 వేల 2030 రూపాయలను జప్తు చేసి, సరైన ఆధారాలు పరిశీలించి గ్రీవెన్స్ కమిటీ కోటి 64 లక్షల 58 వేల 232 రూపాయలను విడుదల చేసినట్లు పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నూరు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 11 లక్షల 7 వేల 950 రూపాయలు, బెల్లంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 55 లక్షల 88 వేల 222, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 15 లక్షల 76 వేల 330 రూపాయలు సీజ్ చేయగా, ఆధారాలను పరిశీలించిన గ్రీవెన్స్ కమిటీ పూర్తి స్థాయిలో నగదును విడుదల చేసిందన్నారు.

ధ్యాన కేంద్రంలో శిక్షణ తరగతులు

బెల్లంపల్లి, మే 5: బెల్లంపల్లి సింగరేణి సంఘమిత్ర ధ్యాన పిరమిడ్ కేంద్రంలో ఆదివారం సీనియర్ పిరమిడ్ మాస్టర్ నరేంద్ర మొదలాకర్‌చే ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించారు. మానవ జీవితంలో విశిష్టత, బుద్ధుని అష్టాంగ మార్గాల గురించి వివరించారు. కార్యక్రమంలో సీనియర్ మాస్టర్‌లు లక్ష్మణ్, శైలజ, శంకరయ్య, యాదగిరి, మనోహర్,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

భీమారం, మే 5: మండలంలోని ఎల్కేశ్వరం, ఎల్‌బీపేట గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్షెట్టిపేటరూరల్: లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని 4, 11 వార్డుల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

వేమనపల్లి, మే 5: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం నీల్వాయిలో సభలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజల సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ వైస్ ఎంపీపీ ఆత్రం గణపతితోపాటు 300 మంది బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఇంటి వద్దనే దివ్యాంగులు, వృద్ధులు ఓటేశారు


మామిడిపల్లిలో వృద్ధురాలి ఇంటి వద్ద పోలింగ్ అధికారులు, సిబ్బంది

దండేపల్లి, మే 5: పోలింగ్ కేంద్రాలకు వెళ్ళలేని వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. మంచిర్యాల నియోజకవర్గ ఎన్నికల అధికారులు దండేపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 22 మంది ఓటు హక్కును ఇంటి వద్దనే వినియోగించుకున్నారు. అందులో భాగంగా ఆదివారం దండేపల్లి మండలంలోని 80 ఏళ్లపైబడిన 9 మంది, 13 మంది దివ్యాంగులు ఇంటి వద్దనే ఎన్నికల అధికా రులు, సిబ్బంది వెళ్లి వారిచే ఎన్నికల నిబంధనల ప్రకారం వారిచే ఓటు వేయించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి


స్థానికులతో మాట్లాడుతున్న ఎస్ఐ సంతోష్

శ్రీరాంపూర్, మే 5: అర్హత కలిగిన ప్రతీ ఒక్కరూ పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్ఐ సంతోష్ అన్నారు. ఆదివారం ఆయన సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి కొత్తరోడ్డు ప్రాంతంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల గురించి తెలుసుకొని తమ, తమ ఓట్లు స్వేచ్ఛగా వేయాలని కోరారు. ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, కొత్త రోడ్డు జంక్షన్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసు కోవాలని సూచించారు. పోలీసు సిబ్బంది వి. వెంక టయ్య, జి. శ్రీనివాస్, గంగాధర్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

హీరాపూర్‌లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం


హీరాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆసిఫాబాద్ రూరల్, మే 5: మండలంలోని హీరాపూర్ గ్రామంలో ఆదివారం కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, మండలాధ్యక్షుడు చరణ్, బీసీసంఘం అధ్యక్షుడు రమేష్, తిరుపతి, గోవింద్, మారుతి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించి కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

జైనూర్: ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మహిళలు మండలపార్టీ అధ్యక్షులు అబ్దుల్‌ముకీద్ అధ్వర్యంలో మండలంలోని దేవుగూడ, అల్లీగూడ, కొండా పాటార్ తదితర గ్రామాల్లో ఆదివారం ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ ఎంపీఅభ్యర్థి ఆత్రంసుగుణను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళానాయకురాలు కనకప్రతిభ మాట్లాడుతూ తొలిసారిగా ఆదిలాబాద్ ఎంపీ సీటును కాంగ్రెస్ అధిష్టానం ఆదివాసీ మహిళకు ఇచ్చిందని ఇంటి ఆడపడుచుగా ఆత్రం సుగుణను అత్యధికంగా ఓట్లువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.


జైనూర్‌లో ఇంటింటికి తిరగి ప్రచారం చేస్తున్న మహిళా నాయకురాళ్లు

రాష్ట్రానికి బీఆర్ఎస్ మాత్రమే రక్షణ కవచం

● ఎమ్మెల్సీ దండే విఠల్

పెంచికలపేట, మే 5: తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీ మాత్రమే రక్షణ కవచం అని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. ఆదివారం మండలంలోని దరోగపల్లి గ్రామంలో కార్యకర్తలతో సమావేశం అనంతరం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ హక్కును కాపాడుకోవాలంటే ఒక్క బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం వీరభద్ర సమేత భద్రకాలి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండెవిఠల్

సెల్ దొరికిందోచ్!

● సీఈఐఆర్ సాంకేతికతో సెల్‌ఫోన్‌ల రికవరీలు


వాంకిడి పోలీస్ స్టేషన్‌లో బాధితునికి సెల్‌ఫోన్ అందిస్తున్న సీఐ, ఎస్సై(ఫైల్)

వాంకిడి, మే 5: డిజిటల్ చెల్లింపుల్లో భాగంగా సెల్‌ఫోన్‌లు అత్యంత కీలకంగా మారాయి. ఇతరులకు నగదు చెల్లింపులు చేయాలన్నా.. అంతర్జాలంలో దరఖాస్తులు నమోదు చేయాలన్నా..సెల్‌ఫోన్‌పై ఆధారపడుతున్నారు. యువకుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరి చేతిలో అత్యంత సాంకేతి కత పరిజ్ఞానంతో కూడిన సెల్‌ఫోన్‌లు దర్శనమిస్తున్నాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న సెల్‌ఫోన్లు చోరీకి గురైతే ఆందోళన చెప్పనలవి కాదు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సీఈఐఆర్ సాంకేతికత పరిజ్ఞానం ద్వారా చోరీకి గురైన సెల్‌ఫోన్‌లు గుర్తించి పోలీసులు బాధితులకు అందిస్తున్నారు.

ఈ ప్రాంతాల్లో జాగ్రత్త..

జిల్లాలో ఎక్కువగా కూరగాయల మార్కెట్, ప్రయాణప్రాంగణాలు, బస్సుల్లో గుర్తుతెలియని వ్యక్తులు సెల్‌ఫోన్ల చోరీలకు పాల్పడుతున్నారు. జిల్లాలో 903సెల్‌ఫోన్లు పోయినట్లు పోలీసులకు ఫిర్యాదులు రాగా సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) సాంకేతికత పరిజ్ఞానాన్ని ఉపయోగించి 191రికవరీ చేసి బాధితులకు ఫోన్లను అప్పగించారు. చోరీకి పాల్పడిన వారు సెల్‌ఫోన్ ఆన్ చేసిన వెంటనే ఏ ప్రాంతంలో ఉందో గుర్తించడానికి వీలు అవుతుందని పోలీసులు చెబుతున్నారు. బాధితులకు అందించారు.

- ఎస్ఎంఎస్ ద్వారా తెలుసుకోవచ్చు..

ఆర్థిక ఇబ్బందులు సరిగా లేక సెకండ్ హ్యాండ్ సెల్‌ఫోన్ కొనుగోలు చేస్తే అది దొంగలించిందా.. బ్లాక్‌లిస్టులో ఉందా అన్న విషయం కేవైయం (నో యువర్ మొబైల్) విధానం ద్వారా ముందే తెలుసుకోవచ్చు. మొబైల్‌లో కేవైఎం అని టైప్ చేసి ఐఎంఈఐ నంబర్‌ను నమోదుచేసి 14422నంబరుకు ఎస్ఎంఎస్ చేసి సమాచారం తెలుసుకోవచ్చు.

- దరఖాస్తు చేయడం ఇలా...

ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా.. చోరీకి గురైనా పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిఉంటుంది. https:///www.ceir.govt.in పోర్టల్ ఓపెన్ చేయాలి. అందులో బ్లాకింగ్/ స్టోలెన్ మొబైల్ అనే లింక్ ఎంచుకోవాలి. అందులో సెల్‌ఫోన్ సంఖ్య 1, సెల్‌ఫోన్ సంఖ్య 2, సెల్‌ఫోన్ బ్రాండ్ మోడల్, ఇన్వాయిస్(బిల్) ఫొటో తదితర వివరాలు నమోదు చేయాలి. యజమాని చిరునామా, ఈ మెయిల్ ఐడీ, నింపాలి. వెంటనే సెల్‌ఫోన్ (పాత నంబరు మీద తీసుకున్న కొత్త సిమ్) నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ నమోదు తర్వాత సబ్‌మిట్ చేయాలి. దీంతోఫోన్ దానంతట అదే బ్లాక్ అవు తుంది. ఇకపై దానిని ఎవరూ ఆపరేట్ చేయలేరు. అందులో ఉండే డేటా సురక్షితంగా ఉంటుంది. ఒకవేళ సెల్‌ఫోన్ చోరీకి పాల్పడిన వ్యక్తి సిమ్ వేయగానే ఫిర్యాదు దారిని సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. దాని ఆధారంగా ఫోన్ ఎక్కడ ఉంది అనేది కనుక్కొని బాధితులకు అంజేస్తున్నారు.

కొనుగోలు కేంద్రంలో కనీస సౌకర్యాలు కరువు


చెట్ల కింద సేద తీరుతున్న రైతులు

దహెగాం, మే 5: మండల కేంద్రానికి సమీపంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ఆదివారం మధ్యాహ్నం చెట్లనీడ కింద సేద తీరారు. 40డిగ్రీలపైగా ఎండలు దంచి కొడుతున్నాయి. కొనుగలో కేంద్రంలో నీడలేక చెట్ల నీడను వెతుక్కుంటున్నారు. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని, ఎండ నుంచి రక్షణకు షామియానాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

నిప్పుల కొలిమిలా జైనూర్


జైనూర్‌లో నిర్మానుశ్యంగా మారిన ప్రధాన రోడ్డు

జైనూర్, మే 5: మండలకేంద్రంతో పాటు మారుమూల గ్రామాల్లో సూర్యుడు నిప్పులు చెరుగుతుండటంతో మధ్యాహ్నం జనజీవనం స్తంభించి పోయింది. అధిక ఉష్ణోగ్రతలు, వడ గాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో ప్రజలు వడ దెబ్బకు గురవుతున్నారు. రేపు, ఎల్లుండి తీవ్రత ఎక్కువగా ఉంటుందని ప్రజలు అవసరమైతే తప్ప బయటికి రావద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఏజెన్సీ పల్లెలో ఎక్కువగా రెకుల ఇండ్లు కావడంతో ప్రజలు అందులో ఒక్క నిముషం కూడా ఉండలేకపోతున్నారు. బయటనే సేద తీరుతున్నారు. ఇక అటవీప్రాంతంలో వన్యప్రాణుల బాధ చెప్పనవసరంలేదు. కనీసం గ్రామ పంచాయతీల అధ్వర్యంలో పశువులకు నీటితొట్టెలు నిర్మించి ఉంటే బాగుండేదని స్థానికులు పేర్కొంటున్నారు. దట్టమైన అటవీప్రాంతంగా పేరొందిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అటవీ ప్రాంతం నానాటికి తగ్గిపోతుండడంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని మండలవాసులు పేర్కొంటున్నారు.

తరుచూ ప్రమాదాలు.. అయినా పట్టించుకోరు



గుంతల మయంగా మారిన రోడ్డు

కెరమెరి, మే 5: మండలంలోని అంబరావుగూడ గ్రామం వద్ద ఆదిలాబాద్-ఆసిఫాబాద్ ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా గుతంతలమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు వర్షాకాలంలో కురిసిన భారీవర్షాలకు గుంతలు ఏర్పడడం, కొన్ని చోట్ల రోడ్డు పూర్తిగా కోతకు గురై కొట్టుకు పోయింది. అలాగే గోయగాం గ్రామసమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు చిత్తర్‌మారన్ వద్ద ఎల్‌అండ్‌టీ అధికారులు అడ ప్రాజెక్టు ముంపులో భాగంగా రోడ్డు నిర్మాణ పనులు నాసిరకంగా మార దంతో రోడ్డు కుంగిపోయింది. ద్విచక్రవాహనదారులు కింద పడి గాయాలపాలైన సందర్భాలు చాలా ఉన్నాయి. పెద్ద వాహనాలు తరచూ రిపేర్లకు గురవుతున్నాయి. కొత్తగా ఎవరైనా ఈ ప్రాంతంలో ప్రయాణిస్తే ప్రమాదం బారిన పడడం ఖాయమని పలువురు పేర్కొంటున్నారు. అలాగే ధనోర, చౌపన్‌గూడ, సుర్దాపూర్ గ్రామాల వద్ద సైతం రోడ్డు అధాన్నంగా తయారైంది. అధికారులు వెంటనే రోడ్లకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

యువకులకు సన్మానం

కెరమెరి, మే 5: సుర్దాపూర్ గ్రామానికి చెందిన సోదరులు మొర్లె భీంరావు, మొర్లెవిఠల్ ప్రభుత్వఉద్యోగాలు సాధించడంతో మాలి సంఘం నాయకులు ఆదివారం వారి ఇంటికి వెళ్లి సన్మానించారు. భీంరావు టీజీటీ ఏకలవ్య మోడల్ స్కూల్‌లో, విఠల్ జిల్లా కోర్టులో ప్రాసెస్ సర్వర్‌గా ఉద్యోగాలు సాధించారు. కార్యక్రమంలో మాలి సంఘం నాయకులు తులసీరాం తదితరులు పాల్గొన్నారు.


భీంరావు, విఠల్‌ను సన్మానిస్తున్న మాలి సంఘం నాయకులు



ఇంటి నుంచి ఓటు వేయడం ఇలా...

- వృద్ధులు, దివ్యాంగులకు అవకాశం



చెన్నూరు, మే 5: ఇంటి నుంచి ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పిస్తోంది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కేంద్ర ఎన్నికల సంఘం దీనిని ప్రవేశపెట్టింది. గత సంవత్సరం తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లో సైతం హోమ్ ఓటింగ్ నిర్వహించారు. ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 8లోపు హోమ్ ఓటింగ్ ముగించాలని ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

80 ఏండ్లు దాటిన వారు, దివ్యాంగులు ఇంటి నుంచే బ్యాలెట్ విధానం లో ఓటు వేయవచ్చు. దివ్యాంగుల్లో 40 శాతం వైకల్యం ఉన్న వారు ఈ సదుపాయం పొందవచ్చు. ఈ విధానంలో వేసే ఓటు బ్యాలెట్ బాక్సుల్లో ఉంటుంది. జూన్ 4న కౌంటింగ్ రోజు ఈ ఓట్లను లెక్కిస్తారు.

12డీ ఫారం సమర్పించాలి

ఓట్ ఫ్రమ్ హోమ్‌కు ముందుగా 12డీ ఫారంను సమర్పించాలి. ఫారం సమర్పించిన వారు మాత్రమే ఇలా ఓటు వేయడానికి అనుమతి ఉం టుంది. దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికే ఎన్నికల సిబ్బంది వస్తారు. వచ్చే ముందు సమాచారం ఇస్తారు. ఆ రోజు ఓటు వేయాలనుకునే వారు అందుబాటులో ఉండాలి. ఎన్నికల సిబ్బంది తమతో బ్యాలెట్ బాక్సును తీసుకువస్తారు. అందులో ఓటు వేయవచ్చు. ఓటు ఎవరికి వేశామన్నది ఇతరులకు తెలిసే అవకాశం ఉండదు. మన ఇంటికి గెజిటెడ్ ఆఫీసర్, అసిస్టెంట్ అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది వస్తారు. ఈ టీమ్ వచ్చినప్పుడు ఓటు వేసే వారు ఇంట్లో లేకపోతే మరో రోజు కూడా ఇంటికి వస్తారు. కానీ మొదటి సారి వచ్చినప్పుడే ఓటు వేయడం మంచిది.

కాంగ్రెస్ పార్టీని ఆదరించండి

జైపూర్, మే 5: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం ముదిగుంటలో ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని బీఆర్ఎస్ నాయకులు పలువురు కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. చల్ల సత్యనారాయణరెడ్డి, విశ్వంబర్‌రెడ్డి, ఫయాజ్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని బెల్లంపల్లి, చెన్నూరు ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, గడ్డం వివేక్‌లు పేర్కొన్నారు. కూరగాయల మార్కెట్, కాంటా చౌరస్తాలో ప్రచారం నిర్వహించారు. కాంటా చౌరస్తాలో నిత్య జన గణమనలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ వెం కట్రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత పాల్గొన్నారు.

● పదేండ్ల మోదీ పాలనలో ప్రగతి శూన్యం

మందమర్రిటౌన్: పదేండ్ల బీజేపీ పాలనలో దేశ ప్రగతి పూర్తిగా దెబ్బతిన్నదని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగానికి రక్షణ ఉండాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. తాము అధికారంలోకి వస్తే యేటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోదీ పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో జవాబు చెప్పాలన్నారు. విదేశాల్లో ఉన్న నల్ల ధనం తీసుకువస్తానని చెప్పి మోదీ ఆ ఊసే లేదన్నారు. లాభాల్లో ఉన్న సంస్థలను కార్పొరేట్ శక్తులకు అంటగడుతున్నారన్నారు.

● వంశీకృష్ణకు ఏఐటీయూసీ మద్దతు

శ్రీరాంపూర్: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు ఏఐటీయూసీ మద్దతు తెలుపుతున్నట్లు యూనియన్ అధ్యక్షుడు సీతారామయ్య పేర్కొన్నారు. ఏఐటీయూసీ జనరల్ బాడీ సమావేశం యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. కార్మికుల సొంతింటి పథకం, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మినహాయింపు, భూగర్భ గనులు, తదితర సమస్యలు పరిష్కరిస్తే ఏఐటీయూసీ పూర్తి మద్దతు ప్రకటిస్తుందన్నారు. ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ, కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని యూనియన్ సభ్యులు తీర్మానం చేశారు. రామడుగు లక్ష్మణ్, వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బాజీసైదా, చంద్రశేఖర్, మల్లయ్యపాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న కాంగ్రెస్, సీపీఐ నాయకులు



ముదిగుంటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిరూరల్: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. చిర్రకుంటలో ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, నరేష్, రాంచందర్, కొమురయ్య పాల్గొన్నారు.



గోదావరిఖని మోటార్ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. గోదావరిఖని చౌరస్తా నుంచి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సింగరేణిలో ఇక నుంచి అవినీతికి తావులేదన్నారు. ఇన్‌కంటాక్స్ రద్దు చేయనున్నట్లు తెలిపారు.

పాలకుర్తి: పార్లమెంటు ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఈప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తానని ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. జయ్యారంలో ప్రచారం నిర్వహించారు. పెద్దపల్లి ప్రాంత అభివృద్ధికి కాకా వెంకటస్వామి పాటుపడిన విధంగా తాను కూడా పాటుపడుతానని పేర్కొన్నారు.

ప్రశాంతంగా 'నీట్'

ఏసీసీ, మే 5 : మంచిర్యాల జిల్లాలో నీట్ (నేషనల్ ఎలిజిబులిటి కమ్ ఎంట్రెన్స్ టెస్ట్) ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మంచిర్యాలలోని కార్మెల్ కాన్వెంట్ ఉన్నత పాఠశాలలో సీబీఎస్ఈ, స్టేట్ రెండు పరీక్ష కేంద్రాలు, ఉషోదయ ఉన్నత పాఠశాల, ట్రినిటీ ఉన్నత పాఠశాల, గుడిపేటలోని మౌంట్ కార్మెల్ హైస్కూల్‌లో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు ఐదు పరీక్ష కేంద్రాల్లో 1384 మంది అభ్యర్థులకు 1354 మంది పరీక్షకు హాజరుకాగా 30 మంది గైర్హాజరయ్యారు. 720 మార్కులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ సబ్జెక్టుల్లో 200 ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో మల్టీపుల్ చాయిస్ పద్ధతిలో నిర్వహించారు. జాతీయ స్థాయిలో మెడిసిన్, డెంటల్ విభాగాల్లో అడ్మిషన్‌ల కోసం దేశ వ్యాప్తంగా ఒకేరోజు పరీక్ష నిర్వహించారు.

ఘనంగా బీరన్న దేవుడి కల్యాణం



బోనాలతో తరలి వస్తున్న మహిళలు

కాసిపేట, మే 5: ధర్మారావుపేటలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో బీరన్న దేవుని కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బుధవారం ప్రారంభమైన ఈ వేడుకల్లో ఆదివారం బీరన్న దేవుని కల్యాణాన్ని యాదవ పూజరులు వైభవంగా నిర్వహించారు. యాదవ మహిళలు బోనాలతో ఆలయానికి తరలి వచ్చి బోనాలు సమర్పించారు. నియమనిష్ఠలు పాటిస్తూ కల్యాణం జరపడం వల్ల పాడి పంటలు అభివృద్ధి చెందడంతో కుటుంబాలను చల్లంగా కాపాడుతాడని యాదవ పూజారులు తెలిపారు. బీరన్న దేవుని కల్యాణంతో నాలుగు రోజులుగా ధర్మారావుపేటలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

విద్యుత్ ఆదా మనందరి బాధ్యత



పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

చెన్నూరు, మే 5: విద్యుత్ ఆదా మన అందరి బాధ్యతగా భావించాలని విద్యుత్ శాఖ ప్రత్యేకాధికారి రాజు చౌహాన్ కోరారు. ఆదివారం పట్టణంలోని సంతోషిమాత ఫంక్షన్ హాలులో చెన్నూరు డివిజన్ స్థాయి విద్యుత్ ఉద్యోగులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. విద్యుత్ భద్రత, పొదుపు తదితర అంశాలపై వివరించారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకుని సంస్థ మనుగడకు కృషి చేయాలని కోరారు. ఇందుకు సంబంధించిన గోడ ప్రతులను విడుదల చేశారు. ఏడీఈ రవికుమార్, ఏఈ శ్రీనివాస్, ఏఈలు, సబ్ ఇంజనీర్‌లు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ల పరిశీలన

మందమర్రిరూరల్, మే 5 : మండలంలోని 33 కేవీ సబ్‌స్టేషన్‌లను ఆదివారం విద్యుత్ ఎస్ఈ శ్రావన్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలకు మరిన్ని ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయాలని, ప్రజలకు నిరంతరం అంతరాయం లేకుండా విద్యుత్ అందించాలన్నారు. విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ కైజర్, ఏఈ జయకృష్ణ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణే ధ్యేయం



బస్సు యాత్రను ప్రారంభిస్తున్న నాయకులు

మందమర్రిటౌన్, మే 5: భారత రాజ్యాంగం రక్షణే ధ్యేయమని మాదిగ యువసేన నాయకులు వేల్పుల కిరణ్, గాలిపెల్లి సురేందర్, సుమన్‌లు పేర్కొన్నారు. ఆదివారం మందమర్రి నుంచి మహారాష్ట్ర అంబేద్కర్ శక్తితల్ వరకు చేపట్టిన బస్సు యాత్రను ప్రారంభించారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగం, రిజర్వేషన్‌లను రద్దు చేయడానికి కుట్రలు జరుగుతున్నాయని, వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మాదిగ, ఇతర ఉపకులాలను చైతన్యం చేయడం కోసమే బస్సు యాత్ర చేపట్టామన్నారు. నాయకులు వెంకటేశ్వర్లు, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంబలి పంపిణీ

కాసిపేట, మే 5: కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ఆధ్వర్యంలో దేవాపూర్‌లో నిర్వహిస్తున్న ఉచిత అంబలి పంపిణీ కార్యక్రమం కొనసాగుతుంది. ఆదివారం 30వ రోజుకు చేరింది. ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు అంబలి ఎంతో ఉపశమనం కలిగిస్తుందని ట్రస్టు సభ్యులు తెలిపారు.

'దోస్త్' నోటిఫికేషన్ విడుదల

- నేటి నుంచి అడ్మిషన్‌ల ప్రక్రియ ప్రారంభం
- మూడు దశల్లో సీట్ల భర్తీ
- జూలై 8 నుంచి తరగతులు ప్రారంభం



ఏసీసీ, మే 5: డిగ్రీ అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదలైంది. ఉన్నత విద్యా శాఖ ఆధ్వర్యంలో దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) ఆన్‌లైన్ అడ్మిషన్‌ల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఇంటర్మీడి యట్‌లో సాధించిన మార్కుల మెరిట్ ఆధారంగా విద్యార్థి ఆన్‌లైన్‌లో రాష్ట్రంలోని ఏ డిగ్రీ కళాశాలలోనైనా అర్హత ప్రకారం తనకు నచ్చిన కోర్సులో అడ్మిషన్ పొందవచ్చు. విద్యార్థి ఒక్కో కాలేజీకి వెళ్లి అడ్మిషన్‌ల కోసం దరఖాస్తు చేయాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారా రాష్ట్రంలో తనకు నచ్చిన పలు కళాశాలలకు ఒకేసారి దరఖాస్తు చేసుకోవచ్చు. వెబ్ ఆప్షన్‌ల ద్వారా ప్రాధాన్యత క్రమం ప్రకారం మెరిట్ జాబితాను అనుసరించి విద్యార్థులు ఎంచుకున్న కళాశాలల్లో అలాట్ మెంట్ జరుగుతుంది.

● మూడుదశల్లో సీట్ల భర్తీ ప్రక్రియ

డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్‌ల భర్తీ ప్రక్రియను మూడు దశల్లో చేపడుతున్నారు. తొలిదశలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఈ నెల 6 నుంచి 25 వరకు, వెబ్ ఆప్షన్ ఈ నెల 15 నుంచి 27 వరకు ఎంచుకోవాల్సి ఉంటుంది. సర్టిఫికెట్ల పరిశీలన 24, 25న, సీట్ల కేటాయింపు జూన్ 3న, ఆన్‌లైన్ రిపోర్టింగ్ జూన్ 4 నుంచి 10వ తేదీలోగా చేయాల్సి ఉంటుంది.

రెండో దశలో అడ్మిషన్ల రిజిస్ట్రేషన్ జూన్ 4 నుంచి 13 వరకు, వెబ్ ఆప్షన్‌ల నమోదు 14 వరకు, సర్టిఫికెట్ల పరిశీలన 13న, సీట్ల కేటాయింపు 18న, సెల్ఫ్‌రిపోర్టింగ్ 19 నుంచి 24లోగా విద్యార్థి ఇవ్వాల్సి ఉంటుంది.

మూడో దశ అడ్మిషన్‌ల ప్రక్రియలో రిజిస్ట్రేషన్ జూన్ 19 నుంచి 25 వరకు, వెబ్ ఆప్షన్‌లు 19 నుంచి 26 వరకు, సర్టిఫికెట్ల పరిశీలన 25న, సీట్ల కేటాయింపు 29న, ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ 29 నుంచి జూలై 3వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. జూలై 8 నుంచి తరగతులను ప్రారంభించనున్నారు.

● డిగ్రీలో విద్యార్థులకు అందుబాటులో 85 కోర్సులు

డిగ్రీలో విద్యార్థులకు దాదాపు 85 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో కోర్సులో 60 నుంచి 180 వరకు సీట్లు విద్యార్థుల సంఖ్యను బట్టి అందుబాటులో ఉన్నాయి. ఇంగ్లీష్, తెలుగు మీడియం కోర్సులను కూడా అందుబాటులో ఉంచు తున్నారు. మంచిర్యాల జిల్లాలో ఐదు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉండగా 22 ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో ఓసీ కాకుండా ఇతర అన్ని కేటగిరిలకు చెందిన దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ తో పాటు స్కాలర్‌షిప్ కూడా ప్రభుత్వం అందిస్తుంది.

● ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నాణ్యమైన విద్య

జిల్లాలో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, లక్షెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉండగా మంచిర్యాలలో సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల ఉంది. ప్రభుత్వ కళాశాలల్లో డాక్టరేట్ చేసిన లెక్చరర్లతో విద్యాబోధన చేస్తున్నారు. విశాలమైన తరగతి గదులు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఒకేషనల్ విద్యార్థులకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయి.అన్ని ప్రభుత్వ కళాశాలల్లో రూ.6 లక్షలు వెచ్చించి వర్చువల్ క్లాస్‌రూంలను డిజిటల్ క్లాస్‌రూంలను ఏర్పాటు చేశారు. కొన్ని కోర్సుల్లో విద్యార్థులు పరిమితంగా ఉంటే యూనివర్శిటీలో అధ్యాపకులు బోధించే తరగతులను వర్చువల్‌గా డిజిటల్ పద్ధతిలో ఇక్కడ అదే కోర్సు చదివే విద్యార్థి వీక్షించవచ్చు. తద్వారా విద్యార్థి ఏ కోర్సు ఎంచుకున్నప్పటికీ పాఠ్యాంశాల బోధన అనేది అందుబాటులో ఉంటుంది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నాణ్యమైన విద్య

-చక్రపాణి, ప్రిన్సిపాల్, మంచిర్యాల



ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నాం. లైబ్రరీ, జిమ్, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, విశాలమైన తరగతి గదులు, డిజిటల్ క్లాస్‌రూంలు వంటి వసతులు ఉన్నాయి. అలాగే అపార అనుభవం కలిగిన లెక్చరర్లతో పాఠ్యాంశాల బోధన జరుగుతుంది. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ఫలితాలు కూడా వస్తున్నాయి. అర్హత కలిగిన విద్యార్థులకు ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు కూడా అందిస్తోంది. దోస్త్ అడ్మిషన్‌ల ప్రక్రియలో ప్రభుత్వ కళాశాలలను ఎంచుకొని భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చు.

కాంగ్రెస్‌కే నేతకానిల మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న నేతకాని సంఘ నాయకులు

నస్పూర్, మే 5 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతు ఇస్తున్నామని నేతకాని మహర్ సేవా సంఘం నాయకులు స్పష్టం చేశారు. సంఘం గౌరవ అధ్యక్షుడు దుర్గం నరేష్, వర్కింగ్ ప్రసిడెంట్ జాడి ఏసయ్యలతో కలిసి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం స్వామి మాట్లాడారు. సమాజానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. దీంతో తాము కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి ఎంపీ అభ్యర్థిని గెలుపునకు కృషి చేస్తామన్నారు. గతంలో ఎంపీ, ఎమ్మెల్యేగా నేతకాని సామాజిక వర్గానికి చెందిన వారు గెలుపొందిన వారు నేతకానిలను మోసం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీకృష్ణ గెలుపునకు కృషి చేస్తామన్నారు. సిద్దార్థ రాంమూర్తి, జనగామ తిరుపతి, రాంబాబు, జాడి ప్రమీళా, కామెర లింగరాజు, సాంబయ్య, శంకర్, దుర్గం సాంతయ్య పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేసిన బీజేపీకి బుద్ధి చెప్పాలి

జైపూర్, మే 5 : మాదిగలను వర్గీకరణ పేరిట మోసం చేసిన బీజేపీకి బుద్ధి చెప్పాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2014 ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని మేనిఫెస్టోలో చేర్చారని, అధికారంలోకి రాగానే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టలేదని ఆయన పేర్కొన్నారు. 2018లో కూడా మాదిగలకు హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థులను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలన్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో మాదిగ భవన్‌లు కట్టిస్తామని ఎమ్మెల్యే వివేక్ మాట ఇచ్చారని, దీంతో మాదిగలు కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కదారి రమేష్, జలంపెల్లి బానేష్, జలంపెల్లి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

ఏసీసీ, మే 5: మంచిర్యాల పట్టణంలోని ఓ ప్రైవేటు హాల్‌లో శ్రీరాంపూర్‌లోని సాందీపని ఉన్నత పాఠశాలలో 2004-05 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటు ఆటా పాటలతో ఉల్లాసంగా గడిపారు. ఉపాధ్యాయులు బండికుమార్, బానేష్, మల్లిక్, రవీందర్‌రెడ్డిలను సన్మానించారు. కార్తీక్, రత్నాకర్, స్వప్న, దివ్య, అలేఖ్య, పావని, నరేష్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మంచిర్యాల, రామకృష్ణాపూర్‌లో పూర్వ విద్యార్థులు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్‌లోని సరస్వతి శిశు మందిర్ 2005-2006 సంవత్సరం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం గద్దెరాగడి భీమా గార్డెన్స్‌లో నిర్వహించారు. 60 మంది కలుసుకోవడం, చిన్న నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. శిశుమందిర్ ప్రధానాచార్యులు పుదారి సత్యనారాయణ, మంచిర్యాల ప్రధానాచార్యులు రాజు, ఉపాధ్యాయులు తిరుపతి, రాజమణిలు పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే తరలించాలి



సారంగపల్లి కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం

మందమర్రిరూరల్, మే 5: సారంగపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాసులు పేరుకుపోయాయి. ధాన్యం తరలించడానికి సిద్ధంగా ఉండగా లారీలు మూడు రోజులుగా రావడం లేదని, లారీల కోసం చూస్తున్నామని రైతులు పేర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రంలో ఇంకా పది లారీలకు పైగా ధాన్యం ఉంది. గతంలో వాసవీ రైసుమిల్లుకు ధాన్యం తరలించేవారని, కానీ ఆ మిల్లు టార్గెట్ అయిపోవడంతో ప్రస్తుతం మరో రైసుమిల్లుకు అధికారులు అటాచ్‌మెంట్ చేయకపోవడంతో లారీలు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని రైతులు భయపడుతున్నారు. కొందరు రైతులు తక్కువ ధరకు దళారులకు విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లారీల్లో ధాన్యం త్వరగా తరలించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

మట్టి లారీల పట్టివేత

జైపూర్, మే 5: మండలంలోని రామారావుపేట శివారులో అనుమతులు లేకుండా పెట్రోలు బంక్ సమీపంలో మట్టి తవ్వకాలు చేపడుతున్నారని స్థానికుల సమాచారం మేరకు ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు మూడు లారీలను పట్టుకుని జైపూర్ పోలీసులకు అప్పగించారు. కాగా అనుమతులు ఉన్నాయని పోలీసులు లారీలను వదిలిపెట్టడంపై స్థానిక యువకులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల నుంచి అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తున్నారని మైనింగ్ అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతోనే టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం ఇచ్చామన్నారు. టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకుని పోలీసులకు అప్పగిస్తే వే బిల్లులు ఉన్నాయని లారీలను వదిలిపెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఎస్ఐ శ్రీధర్‌ను వివరణ కోరగా అనుమతులు ఉన్నాయని టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెప్పడంతోనే విడిచిపెట్టామన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి

ఏసీసీ, మే 5: ప్రధాని నరేంద్రమోదీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హాలులో నిర్వహించిన కార్యక్రమంలో యూత్ పట్టణాధ్యక్షుడు బింగి ప్రవీణ్, చల్ల విక్రమ్‌ల ఆధ్వర్యంలో 200 మంది బీజేపీలో చేరగా రఘునాథ్ కండువాలు కప్పి ఆహ్వానించారు. హరికృష్ణ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓట్లు వేయాలని బీజేపీ సీనియర్‌నాయకుడు తుల మధుసూదన్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో ముస్లిం మైనార్టీలను కలిసి బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. నాయకులు గోలి రాము, విజయ్‌కుమార్, దాస్య పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ

మందమర్రిటౌన్, మే 5 : పట్టణంలో ఆదివారం బీజేపీ నాయకులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కోల్‌బెల్ట్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే, జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, నాయకులు దుర్గం అశోక్, సుభాష్‌లు పాల్గొన్నారు. అనంతరం నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రతి కార్యకర్త బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. నరేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.